282) లలిత/మోహన

ప॥ ఇతరుల నడుగము యితడే మా దాత। యితని యీవి వొరులియ్యగ గలరా ॥

చ॥ దేవదేవుడాదిమ పురుషుడు హరి। శ్రీవత్సాంకుడు చిన్మయుడు।
యీవల నావల యిలువేలుపతడు। భావజగురుడు మా పాలిటివాడు ॥

చ॥ జగదేక గురుడు శాశ్వతుడచ్యుతు-। డగజకు వరదుడు అనంతుడు।
తగి మము నేలికైనదైవము యేలిక। నిగమమూర్తి మా నిజబంధువుడు ॥

చ॥ కలిదోష హరుడు కైవల్యవిభుడు। అలరిన శ్రీవేంకటాధిపుడు।
చలిమి బలిమి మా జననియు జనకుడు। అలమి యితడు మాయంతర్యామి ॥